www.prajasakti.com

ప్రజాశక్తి

బుధవారం 16 అక్టోబర్ 2024

5

తూర్పుగోదావరి

ఎస్‌సి, ఎస్‌టి అభ్యర్థులకు డిఎస్‌సిలో శిక్షణ

రాజమహేంద్రవరం రూరల్ : జిల్లాకు చెందిన ఎస్‌సి, ఎస్‌టిల అభ్యర్థులకు డిఎస్‌సిలో మూడు నెలల పాటు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఇన్‌చార్జి జిల్లా ఎస్‌సి సంక్షేమ అధికారి ఎం.సందీప్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణా కాలంలో ఉచిత భోజన, వసతి సౌకర్యం ఉంటుందన్నారు. దీని కోసం http://jnanabhumi.ap.gov.in వెబ్ సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. 11 అకోట్బర్ 2024 నుంచి 21 అక్టోబర్ 24 వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందన్నారు. ఈ శిక్షణా తరగతులకు ఎస్‌జిటిలకు ఇంటర్మీడియట్‌తో పాటు డైట్ సెట్, టెట్, స్కూల్ అసిస్టెంట్స్‌కు డిగ్రీ గ్రాడ్యుయేషన్, బిఇడి, టెట్ విద్యార్హతలు కలిగినవారు అర్హులన్నారు. అభ్యర్థులు కుటుంబ వార్షికాదాయం రూ.2.50 లక్షల లోపు ఉండాలన్నారు. అభ్యర్థులను ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ పరీక్ష ద్వారా ఎంపిక చేస్తామన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

వెంటాడుతున్న వరుణుడు

- ఇప్పటికే వేయి ఎకరాల్లో కోతలు
- పంట చేతికందే సమయంలో వర్షాలు
- అల్పపీడనంతో ఆందోళనలో రైతులు

నల్లజర్లలో కోతలు కోయిస్తున్న రైతులు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

పంట చేతికందే సమయంలో వాతావరణ హెచ్చరికలు రైతులను కంటిపై కునుకు లేకుండా చేస్తున్నాయి. ధాన్యం ఇంకా కళ్లాలల్లోనే ఉండటంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. అల్పపీడన ప్రభావంతో మంగళవారం ఉదయం జిల్లాలో పలుచోట్ల వర్షం కురిసింది. ఈ నేపథ్యంలో కోతలు పూర్తయిన రైతులు ధాన్యాన్ని ఆరబెట్టుకునేదుకు సౌకర్యాలు లేకపోవడంతో ఇబ్బందులు పడ్డారు. గత సీజన్‌లో తుపాను నట్టేట ముంచిన విషయం విదితమే. ధాన్యం కోతలు పూర్తయ్యే రోజుల్లో అపార నష్టం తెచ్చిపెట్టింది. ఖరీఫ్‌లో తీవ్ర వర్షాభావం ఎదురైనప్పటికీ కోతల సమయంలో వర్షాలు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి.

జిల్లా వ్యాప్తంగా 1.75 లక్షల ఎకరాల్లో వరి సాగు జరిగింది. ఈ ఏడాది ఎకరాకు 40 బస్తాల దిగుబడి వచ్చిందని రైతులు చెబుతున్నారు. ఈ సీజన్‌లో 4.3లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేశారు. జిల్లా వ్యాప్తంగా వడివడిగా కోతలు ప్రారంభమవుతున్నాయి. ఈ సీజన్‌లో రాష్ట్ర ప్రభుత్వం జిల్లా పౌరసరఫరాల శాఖకు 2.50 లక్షల మెట్రిక్ టన్నులు ధాన్యం కొనుగోలు లక్ష్యం నిర్దేశించింది. 232 రైతుసేవా కేంద్రాల్లో కొనుగోలుకు రంగం సిద్ధమైంది. కొంత ధాన్యం ఇప్పటికే దళారులు కొనుగోలు చేసేందుకు సమాయత్తం అవుతున్నారు. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా వేయి ఎకరాలకు పైగా పంటను రైతు కోశారు. ఇది ఇంకా రైతుల వద్దే ఉందిో అల్పపీడనం కారణంగా వర్షాలు కురవటంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ దుస్థితిని అవకాశంగా మార్చుకుని వ్యాపారులు అయినకాడికి బేరమాడుతున్నారు. గతేడాదితో పోల్చితే ఈ ఏడాది డిమాండ్ ఉండటంతో మద్దతు ధరలకు రూ.200 తేడాతో కొనుగోలు చేస్తున్నట్లు రైతులు చెరబుతున్నారు. ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర ప్రకారం కామన్ వెరైటీ క్వింటాల్‌కు రూ.2,100 ఇవ్వాలి. ఎ-గ్రేడ్‌కు రూ.2,120 చొప్పున చెల్లించాల్సి ఉంది. అయితే కొనుగోలు కేంద్రాల వద్ద 17 శాతం కంటే ఎక్కువ తేమ ఉంటే కొనుగోలుకు నిబంధనలకు అడ్డుగోడలుగా మారనున్నాయి.

వర్షాలు, తుపాన్ల సమయంలో పంట ఉత్పత్తులను కాపాడుకునేందుకు రైతులకు టార్పాలిన్లు అత్యవసరం. వరి నూర్పిడి చేసిన తరువాత ధాన్యం ఆరబెట్టే క్రమంలో వర్షాలకు, మంచు వల్ల తడిసిపోకుండా టార్పాలిన్లు వాడతారు. ప్రధానంగా పంట దిగుబడులు చేతికొచ్చే దశలో తుఫాన్లు, వర్షాలు కురిస్తే టార్పాలిన్లుకు విపరీతమైన డిమాండ్ ఉంటుంది. గతంలో 50 శాతం రాయితీపై రైతులకు పంపిణీ చేసేవి. ఐదేళ్లుగా పంపిణీకి నోచుకోలేదు. దీంతో బహిరంగ మార్కెట్‌లో అధిక ధర చెల్లించి కొనుగోలు చేయవలసి వస్తోందని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

కోతలు నిలుపుదల చేయాలి

ప్రస్తుతం వర్షాలు, అధికంగా ఉన్న ప్రాంతాల్లో కోతలు నిలుపుదల చేయాలి. పొలంలో నీరు నిలవకుండా బయటకు పోయే విధంగా పారుదల వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలి. మరీ అధికంగా వర్షం పడితే తగ్గిన వెంటనే 5 శాతం ఉప్పు ద్రవాణాన్ని కంకులపై పడే విధంగా పిచికారి చేసి పక్వానికి వచ్చిన పంటను సంరక్షణ చర్యలు చేపట్టాలి. పిఆర్ 126, ఆర్‌పి బయో, ఇప్పటి వరకు 418 హెక్టార్లలో వరికోతలు జరిగాయి.

- ఎస్.మాధవరావు, జిల్లా వ్యవసాయశాఖ అధికారి

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

జిల్లాలో14 ఇసుక ఓపెన్ రీచ్‌లు

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

జిల్లాలో 14 ఇసుక ఓపెన్ రీచ్‌లను కేటాయించామని కలెక్టర్ పి.ప్రశాంతి తెలిఇపారు. మంగళవారం జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రశాంతి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన షెడ్యూల్ అనుసరించి అక్టోబర్ 16 నుంచి ఎల్-1 అభ్యర్థులు ఇసుక తవ్వకాలు ప్రారంభించాల్సి ఉంటుందన్నారు. నిబంధనలను కచ్చితంగా పాటించేలా పర్యవేక్షణ తప్పనిసరిగా పర్యవేక్షణ ఉండాలన్నారు. రోజుకి 1000 మెట్రిక్ టన్నులు తవ్వకాలు చేయాల్సి ఉంటుందన్నారు. ఎటువంటి యంత్రాలు వినియోగించరాదని, తవ్వకాల్లో పనిచేసే వారికి ఉపాధి హామీ కూలీ వేతనం వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. రీచ్‌ల్లో విధులు నిర్వహించే అధికారులు, సిబ్బంది సమయపాలన పాటించాలన్నారు. తవ్వకాలు, రవాణా, రికార్డుల నిర్వహణ, డెలివరీ తదితర అంశాల విషయంలో పక్కాగా ఉండాలన్నారు. ఎన్‌జిటి మార్గదర్శకాలు మేరకు బోట్స్ మెన్ సొసైటీస్ డీసిల్టేషన్ ప్రక్రియ చేపట్టేందుకు అనుమతులు జారీ చేశామని తెలిపారు. అందుకు అనుగుణంగా రీచ్‌లు ప్రారంభం కానున్నాయన్నారు. ప్రతి వాహనానికి జియో ట్యాకింగ్ సిస్టం ఏర్పాటు చేశామన్నారు. ఈ మేరకు క్రాస్ చెక్ చేయడంతో పాటూ, డీవియేషన్ చేసిన వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. ఎంపిడిఒలు, సంబంధించిన పంచాయతీ కార్యదర్శులు తనిఖీలు ముమ్మరంగా నిర్వహించి, ఆమేరకు నివేదికను డివిజనల్ అభివృద్ధి అధికారికి పంపాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జెసి ఎస్.చిన్నరాముడు, అదనపు ఎస్‌పి ఎవి.సుబ్బరాజు, ఆర్‌డిఒలు ఆర్.కృష్ణనాయక్, రాణి సుస్మిత, ఎడి మైన్స్ డి.ఫణిభూషణ్‌రెడ్డి, జిల్లా గ్రౌండ్ వాటర్ అధికారి వైశ్రీనివాస్, ఇరిగేషన్ ఇఇ ఆర్.కాశీవిశ్వేశ్వరరావు, జిల్లా రవాణా అధికారి ఆర్.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కొత్త కమిటీలతో కాంగ్రెస్ బలోపేతం

జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు డాక్టర్ విశ్వేశ్వరరావు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

త్వరలో కాంగ్రెస్ అనుబంధ విభాగాలను ఏర్పాటు చేసి, తద్వారా పార్టీ బలోపేతానికి ప్రణాళిక రూపొందిస్తామని తూర్పు గోదావరి జిల్లా కాంగ్రెస్ పార్టీ కమిటీ పరిశీలకులు కె.శివాజీ, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ టికె.విశ్వేశ్వరరెడ్డి పునరుద్ఘాటించారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కాలనీలోని జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యాలయంలో జరిగిన జిల్లా కాంగ్రెస్ విస్తత సమావేశంలో పలువురుకాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా జరిగిన జిల్లా సమావేశంలో శివాజీ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. వార్డు స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేసేందుకు అందరకూ కృషి చేయాలన్నారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు టీకే విశ్వేశ్వర రెడ్డి మాట్లాడుతూ ఈ నెలాఖరు నాటికి 19 మండలాల్లో 14 కాంగ్రెస్ విభాగాలకు కమిటీలను నియమిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షులు బాలేపల్లి మురళీధర్, మార్టిన్ రూథర్, మోతా శారద, సువర్ణ, పట్నాల శ్రీనివాస్, బెజవాడ రంగారావు, అబ్దుల్లా షరీఫ్, డాక్టర్ వడయార్, తదితరులు పాల్గొన్నారు.

విద్యా దీపిక పక్ష పత్రిక ఆవిష్కరణ

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

మండలంలోని మోర్త ఉన్నత పాఠశాల విద్యార్థులతో నిర్వహిస్తున్న విద్యా దీపిక పక్ష పత్రిక 100వ సంచికను మండల విద్యాశాఖ అధికారులు సిహెచ్.సక్సేనారాజు, డి.శారదాజ్యోత్స్న, హెచ్ఎం కె.శ్రీనివాస్ మండల విద్యాశాఖ కార్యాలయంలో మంగళవారం ఆవిష్కరించారు. విద్యార్థుల్లో రచనల పట్ల, పఠనం పట్ల ఆసక్తి పెంచుతూ పత్రికను నిర్వహిస్తున్న సంపాదకులు, తెలుగు భాషో పాధ్యాయులు కృష్ణప్రసాద్ కృషిని అభినందించారు. పత్రిక నిరంతరాయంగా వెలువడుతూ విద్యార్థుల్లో జ్ఞానతృష్ణను పెంచే విధంగా నిర్వహిస్తున్న కృష్ణప్రసాద్‌ను శారదా జోత్స్న అభినందించారు. పత్రిక నిర్వహణ సామాన్య విషయం కాదన్నారు. ఈ పత్రికను నిరాటంకంగా నిర్వహించడం ఇంతవరకూ నిర్వహించడం గొప్ప విషయమని తాను పత్రిక గౌరవ సంపాదకులుగా ఉన్నందుకు గర్వంగా ఉందన్నారు.

చిన్నారులకు స్వచ్ఛమైన నీటిని అందించాలి

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

అంగన్‌వాడీల్లో చిన్నారులకు స్వచ్ఛమైన తాగునీటిని అందించాలని కలెక్టర్ పి.ప్రశాంతి అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ ఛాంబర్‌లో ఐసిడిఎస్, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీ రాజ్, విద్యుత్ శాఖల అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. ఆయా గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలకు స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు ట్యాప్ కనెక్షన్లను ఇచ్చేందుకు ప్రతిపాదనలను సిద్ధం చేయాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు ఇచ్చే కనెక్షన్‌ను ఆర్ఓ ప్లాంట్‌కు అనుసంధానం చేయాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రల్లో విద్యుత్ సరఫరా విషయంలో ఎటువంటి ఆటంకం లేకుండా చూడాలన్నారు. ఐసిడిఎస్ అధికారులతో పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు సమన్వయం చేసుకొని నివేదిక అందించాలన్నారు. ఈ సమావేశంలో ఐసిడిఎస్ పీడీ కె.కృష్ణకుమారి, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి బివి.గిరి, విద్యుత్ శాఖ ఎస్ఇ కె.తిలక్‌కుమార్, పంచాయతీరాజ్ ఎస్ఇ అలీముల్లా, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పలుచోట్ల పల్లెపండుగ

ప్రజాశక్తి-కడియం

మండలంలోని వీరవరం, పొట్టిలంక గ్రామాల్లో పల్లె పండుగలో భాగంగా సిసి రోడ్లు, శ్మశానం ఆవరణ ఆధునికీకరణ పనులకు ఎంఎల్ఎ గోరంట్ల బుచ్చయ్యచౌదరి మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా గోరంట్ల మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా పల్లె పండుగ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి వెలుగుబంటి ప్రసాద్, సర్పంచ్‌లు, కూటమి నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

తాళ్లపూడి : మండలంలోని అన్నదేవరపేటలో జరిగిన పల్లె పండుగలో కొవ్వూరు ఎంఎల్ఎ ముప్పిడి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. గ్రామంలో రూ.10లక్షలతో చేపట్టే చిలకమ్మతోటకు వెళ్లే సిసి రోడ్ల పనులకు ఆయన భూమి పూజ చేశారు. గ్రామానికి వచ్చిన ఎంఎల్ఎకు పారిశ్రామికవేత్త జివి.ప్రసాద్, జనసేన నాయకులు సిహెచ్.బంగారాజు తదితరులు స్వాగతం పలికారు. సర్పంచ్ ఎలిపే సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

నచ్చిన మిల్లులో అమ్ముకోవచ్చు

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

రైతులు తమ ధాన్యాన్ని నచ్చిన రైస్ మిల్‌లో అమ్ముకునేందుకు ప్రభుత్వం వీలు కల్పించిందని మండల వ్యవసాయ అధికారి ఎం.విశ్వాసరావు తెలిపారు. మంగళవారం దమ్మెన్నులో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. రైతులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గురజర్ల వీరవెంకటసత్యనారాయణ, రైతులు పాల్గొన్నారు. అనంతరం సర్పంచ్, కార్యాలయ సిబ్బంది, కార్యాలయం ఆవరణలో భారతదేశ మాజీ రాష్ట్రపతి, డాక్టర్ అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాలవేసి, నివాళు లర్పించారు.

సమస్యలపై దశలవారీ పోరాటం

తపాల ఉద్యోగుల సంఘం నాయకులు కొండబాబు

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం

తపాలా శాఖలో వివిధ కేడర్లలో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యల పరిష్కారం కొరకు దశల వారీ పోరాటానికి దిగుతున్నామని రాజమండ్రి తపాల ఉద్యోగుల సంఘం కార్యదర్శి బి.కొండబాబు తెలిపారు. నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ పోస్టల్ ఎంప్లాయిస్, అనుబంధ సంఘాలు, ఎఐజిడిఎస్‌యు పిలుపు మేరకు మంగళవారం నగరంలోని ప్రధాన తపాల కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ నెల 23 నుంచి 25వరకూ డిమాండ్లతో కూడిన నల్ల బ్యాడ్జీలను ధరిస్తామన్నారు. పోస్ట్ కార్డ్, ఈమెయిల్ క్యాంపెయిన్ నిర్వహించనున్నట్లు తెలిపారు. నవంబర్ 12, 13 తేదీల్లో ఢిల్లీలోని డాక్ భవన్ వద్ద నిరాహార దీక్ష చేయనున్నట్లు తెలిపారు. రద్దుచేసిన ఎన్ఎఫ్‌పిఇ, ఎఐపిఇయు, గ్రూప్-సి యూనియన్ గుర్తింపును వెంటనే పునరుద్ధరించాలన్నారు. తపాలా శాఖను కార్పొరేట్, ప్రయివేటీకరణకు ప్రోత్సహించే పోస్టల్ యాక్ట్-2023ను వెనక్కి తీసుకోవాలన్నారు. ఐపిపిబి ఆధ్వర్యంలో నడిపిస్తున్న సాంకేతికపరమైన అన్ని పనులను గతంలో మాదిరిగా తపాలాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించాలన్నారు. 8వ వేతన సవరణ కమిటీ వెంటనే నియమించాన్నారు. పి4 యూనియన్ సెక్రటరీ జెవి.సత్యనారాయణ మాట్లాడుతూ ఒపిఎస్‌ను పునరుద్ధరించాలని, పోస్టల్ శాఖలో ఖాళీలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కారుణ్య నియామకాల్లో ఉన్న సీలింగ్ నిబంధనలు తొలగించాలన్నారు. అశాస్త్రీయమైన, ఆచరణ సాధ్యంకాని టార్గెట్లు వెంటనే ఆపాలన్నారు. రాజమండ్రి జిడిఎస్ యూనియన్ సెక్రటరీ పి.భూలోకం మాట్లాడుతూ జిడిఎస్ ఉద్యోగులకు ఎనిమిది గంటల పనిదినాలు కల్పించాలన్నారు. జిడిఎస్ ఉద్యోగులకు డిపార్టుమెంటు ఉద్యోగులతో సమానంగా సౌకర్యాలు కల్పించాలన్నారు. కమలేష్ చంద్ర కమిటీ రిపోర్టులో జిడిఎస్ ఉద్యోగులకు అనుకూలంగా ఉన్న సిఫార్సులను తక్షణమే అమలు చేయాలన్నారు. అనతరం డివిజనల్ సూపరింటెండెంట్‌కి వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో పి3 యూనియన్ ప్రెసిడెంట్ యుజి.ప్రకాష్, పి4 యూనియన్ ప్రెసిడెంట్ ఐ.శ్రీనివాస్, జిడిఎస్ యూనియన్ ప్రెసిడెంట్ బివి.రమణ, ఉద్యోగులు పాల్గొన్నారు.

డివిజనల్ సూపరింటెండెంట్‌కు వినతపత్రం ఇస్తున్న యూనియన్ నాయకులు

భూమి పూజ చేస్తున్న ఎంఎల్ఎ మద్దిపాటి

గ్రామాలే దేశానికి పట్టుగొమ్మలు

ప్రజాశక్తి - నల్లజర్ల

గ్రామాలే దేశానికి పట్టుగొమ్మలని, గ్రామాలు అభివృద్ధి చెందితేనే దేశం అభివృద్ధి చెందినట్లని గోపాలపురం ఎంఎల్ఎ మద్దిపాటి వెంకటరాజు అన్నారు. మంగళవారం మండలంలోని ఆరు గ్రామాల్లో రూ.1.05 కోట్లతో చేపట్టే పలు అభివృద్ధి పనులకు ఆయన శ్రీకారం చుట్టారు. తొలుత అచ్చన్నపాలెంలో రూ.10లక్షలతో నిర్మించనున్న కల్వర్టుకు శంకుస్థాపన చేశారు. అనంతరం గంటావారిగూడెం. దూబచర్ల, అయ్యవరం, ముళ్లగుంట, పుల్లలపాడు గ్రామాల్లో సిసి డ్రెయినేజీ, కల్వర్టు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వంలో ఎక్కడా తట్ట మట్టి కూడా వేయలేదని విమర్శించారు. టిడిపి ప్రభుత్వం అభివృద్ధిలో ముందుంటుందన్నారు. ఈ సందర్భంగా ప్రజలతో మాట్లాడి సమస్యలను తెలుసు కున్నారు. సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు తాతిన సత్యనారాయణ, నాయకులు యలమాటి శ్రీనివాసరావు, కూచిపూడి ఉదయ్‌భాస్కరరావు, చుక్కా శ్రీనివాసరావు, నందమూరి రామకృష్ణ, పావులూరి శ్రీనివాసరావు. తాడిగడప బాలయ్య, గుడిసె శివకృష్ణ, సీమకుర్తి ప్రసాద్, డి.మల్లీశ్వరి, కె.బాలగంగాధరరావు తదితరులు పాల్గొన్నారు.

'అందరికీ ఆరోగ్యం.. అదే మా లక్ష్యం'

ప్రజాశక్తి - నల్లజర్ల

'అందరికీ ఆరోగ్యం అదే మా లక్ష్యం' అంటూ నినదిస్తూ దుబచర్లలో నల్లజర్ల మండల వైద్య ఉద్యోగులు మంగళవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. అంతర్జాతీయ గ్రామీణ మహిళల దినోత్సవం, గర్భస్థ శిశు మరణాల జ్ఞాపకార్ద దినోత్సవం, ప్రపంచ చేతుల పరిశుభ్రత దినోత్సవం సందర్భంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. స్వచ్ఛంద సేవా సంస్థ ఆమెన్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షులు ఇవాంజలిన్ అశోక్ సహకారంతో నల్లజర్ల ప్రభుత్వాసుపత్రి వైద్య ఉద్యోగులు దూబచర్లలోని డైట్ కళాశాలలో అవగాహనా సదస్సు అనంతరం ర్యాలీ నిర్వహించారు. డైట్ కళాశాల విద్యార్థులకు ఆరోగ్యంపై సంపూర్ణ స్థాయిలో అవగాహన కల్పించడం ద్వారా అది ప్రజల్లోకి వెళ్తుందనే ఆలోచనతో ఈ కార్యక్రమం చేపట్టామని ప్రభుత్వ ఆసుపత్రి కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ పలివెల ప్రసాదరావు తెలిపారు. తమకు సహకరిస్తున్న ఆమెన్ ట్రస్ట్ నిర్వాహకులు ఇవాంజలిన్ అశోక్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పిహెచ్‌సి పర్యవేక్షకులు ఎం.అన్నమ్మ, ఎంఎల్‌హెచ్‌పి షేక్ జరీనా, ఆరోగ్య సహాయకులు కొక్కిరపాటి సుబ్బారావు, వైద్య ఉద్యోగుల సంఘం నాయకులు జివివి.ప్రసాద్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పరిశోధనలకు అంతర్జాతీయంగా ప్రోత్సాహం

ప్రజాశక్తి - రాజానగరం

పరిశోధనలను కొనసాగించే వారికి అంతర్జాతీయంగానూ ప్రోత్సాహం లభిస్తుందని దక్షిణ కొరియాలోని చుంగ్ ఆంగ్ విశ్వవిద్యాలయం యానిమల్ బయోటెక్నాలజీ, బిఇటి పరిశోధనా కేంద్రం బ్రెయిన్ పూల్ రీసెర్చ్ ప్రొఫెసర్ డాక్టర్ జి.గంగరాజు అన్నారు. గోదావరి గ్లోబల్ విశ్వవిద్యాలయం ఎఫ్ఇడి విభాగం ఆధ్వర్యంలో బహుళ ఫంక్షనల్ అప్లికేషన్స్‌లో నానో టెక్నాలజీ పురోగతి అనే అంశంపై మంగళవారం సెమినార్ నిర్వహించారు. దీనికి గంగరాజు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. నానో టెక్నాలజీపై అవగాహన కల్పించారు. నానో టెక్నాలజీ ఇటీవల ఏ రంగాల్లో ఎలా ఉపయోగిస్తున్నారనే దానిపై వివరించారు. వివిధ దేశాల్లో ఉన్నత విద్యలో ఎంట్రన్షిప్ చేసేందుకు ఎలా సంప్రదించాలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు. అనంతరం జిజియు ఉపకులపతి డాక్టర్ యు.చంద్రశేఖర్, డైరెక్టర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరావు, రిజిస్ట్రార్ డాక్టర్ పిఎంఎంఎస్.శర్మలతో ఆయన సమావేశమయ్యారు. ఈ కార్యక్రమంలో గైట్ అటానమస్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ టి.జయానందకుమార్, డీన్ డాక్టర్ బి.శ్రీనివాసరాజు, హెచ్ఒడిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొరియా రీసెర్చ్ ప్రొఫెసర్ డాక్టర్ గంగరాజును విసి చంద్రశేఖర్, రిజిస్ట్రార్ డాక్టర్ శర్మ సన్మానించారు.

మహిళలకు సన్మానం

ప్రజాశక్తి -దేవరపల్లి

గ్రామీణ మహిళా దినోత్సవం సందర్భంగా దేవరపల్లి పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ కడిమి వీరకుమారి, వార్డు సభ్యులు గద్దె రమాదేవి, చల్లా లక్ష్మి, సచివాలయ మహిళా సిబ్బందిని మంగళవారం ఘనంగా సత్కరించారు. ఉప సర్పంచ్ వెలగ సాంబశివరావు, వార్డు సభ్యులు కైరం అప్పారావు, ఎంపిటిసి మాజీ సభ్యులు కడిమి రాజు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు

వృద్ధులకు దుప్పట్ల పంపిణీ

ప్రజాశక్తి-గోకవరం

కోరుకొండ మండలం కోటి కేశవరంలో కొంతకాలంగా విఆర్ఒగా దార ధర్మరాజు విధులు నిర్వహించారు. బదిలీల్లో భాగంగా ఇటీవల గోకవరం మండలం కామరాజుపేటకు వచ్చారు. కోటికేశవరంలో వృద్ధులకు దుప్పట్లు, చీరలు పంపిణీ చేశారు.

నర్సరీ దిగ్గజం చంటియ్య మృతి

ప్రజాశక్తి- కడియం

దేశ నర్సరీ రంగంలో ఒక బ్రాండ్‌గా మారిన శ్రీ సత్య దేవా నర్సరీ మరో మూలస్తంభాన్ని కోల్పోయింది. మొక్కవోని దీక్షతో మొక్కల మధ్య పెరిగి మహావృక్షంగా ఎదిగిన కడియం నర్సరీ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు డాక్టర్ పుల్లా సత్య నారాయణ(చంటియ్య)(57) సోమవారం అర్ధరాత్రి మృతి చెందారు. ఆయనకు భార్య, కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కుమారుడు పుల్లా పెద సత్యనారాయణ నర్సరీ రంగంలోనే కొనసాగుతున్నారు.

నిరంతరం శ్రమతో తాను సృష్టించుకున్న నర్సరీ ప్రపంచం విశాలంగా మారినా, మంది మాగధులు చేరినా పని తప్ప పెత్తనం చేయని ఉత్తమ యజమాని పుల్లా చంటియ్య. ఖరీదైన కార్లు తన లోగిలిలో ఉన్నా సైకిల్‌పైనే తలకు తలపాగా చుట్టి కూలీల్లో కూలీగా మారి పనిచేయడం ఆయన నైజం. చంటియ్య నర్సరీని సందర్శించిన సామాన్యులకైనా ఏదొక ఫలం కానుకగా ఇచ్చి ఆప్యాయతతో ఆతిథ్యం అందించిన అమృత హస్తం ఆయనిది. సర్ ఆర్థర్ కాటన్ నర్సరీ మెన్ అసోసియేషన్ అధ్యక్షునిగా పనిచేసిన కాలంలో నర్సరీ రైతులకు అతిపెద్ద అసోసియేషన్ కార్యాలయాన్ని అందుబాటులోకి తీసుకొచ్చారు. కొద్ది నెలల క్రితమే ఆయన గౌరవ డాక్టరేట్ పొందారు. కృషీ వలునిగా, అజాత శత్రువుగా నిలిచిన చంటియ్య మరణ వార్త నర్సరీ రంగాన్ని శోకసముద్రంలో ముంచింది. ఆయన మృతి పట్ల రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్, రాజమమేంద్రవరం రూరల్ ఎంఎల్ఎ గోరంట్ల బుచ్చయ్యచౌదరి, నర్సరీ అసోసియేషన్ అధ్యక్షులు మల్లు పోలరాజు, ఇండియన్ నర్సరీ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు పల్ల సుబ్రహ్మణ్యం, పల్ల వెంకన్న చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ పల్ల సత్యనారాయణమూర్తి, ప్రముఖ నర్సరీ అధినేతలు మార్గాని సత్యనారాయణ, తాడాల చక్రవర్తి తదితర ప్రముఖులు సంతాపం తెలిపారు.



నర్సరీలో రైతు చంటియ్య(తలపాగా వ్యక్తి) ఫైల్ ఫొటో

సర్వీస్ రోడ్డు నిర్మించాలి

ప్రజాశక్తి - నల్లజర్ల

నల్లజర్ల మండలం పుల్లలపాడు వద్ద జాతీయ రహదారి వెంబడి సర్వీస్ రోడ్డు నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు. సర్వీసు రోడ్డు లేకపోవడంతో ఇప్పటి వరకూ జరిగిన ప్రమాదాల్లో 13 మంది వరకూ మరణించారని పుల్లలపాడు, ముసుళ్లకుంట గ్రామాల రైతులు ఎంఎల్ఎ మద్దిపాటి వెంకటరాజు వద్ద వాపోయారు. మంగళవారం పర్యటించిన ఎంఎల్‌కు వారు తమ గోడును వెల్లబుచ్చుకున్నారు. జాతీయ రహదారికి ఇరువైపులా సర్వీస్ రోడ్డు నిర్మించాలని, మారెళ్లమూడి వద్ద కనీసం అండర్ పాసింగ్ అయినా నిర్మించాలని కోరారు. దీనిపై ఎంఎల్ఎ స్పందించారు. సమస్య పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. పుల్లలపాడులో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు చోరీకి గురవుతున్నాయని, రెండేళ్లయినా పోలీసులు పట్టించుకోలేదని ఎంఎల్ఎకు తెలిపారు. ఈ విషయాన్ని నల్లజర్ల సిఐ నక్క శ్రీనివాస్ దృష్టికి ఎంఎల్ఎ మద్దిపాటి తీసుకెళ్లారు.

ఎంఎల్ఎ మద్దిపాటికి సమస్యను విన్నవిస్తున్న రైతులు

ప్రొఫెసర్ సాయిబాబాకు సంతాపం

ప్రజాశక్తి - రాజానగరం

ఢిల్లీ యూనివర్సిటీ ప్రొఫెసర్ జిఎన్.సాయిబాబా మృతికి రాజానగరం ఎఐకెఎంఎస్ సిపిఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు సంతానం తెలిపారు. అఖిల భారత రైతు కూలీ సంఘం డివిజన్ కార్యాలయంలో సాయిబాబా చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. సిపిఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు పి.వెంకట్‌నాయుడు, అఖిల భారత రైతు కూలీ సంఘం అధ్యక్షులు జె.సత్తిబాబు మాట్లాడారు. ఆదివాసీల హక్కుల కోసం పోరాడినందుకు సాయిబాబాను తొమ్మిదేళ్లు అక్రమంగా ఎన్‌డిఎ సర్కారు నిర్బంధించిందన్నారు. ఆయన మరణానికి ప్రభుత్వమే కారణమన్నారు.

రాష్ట్రస్థాయి యోగా పోటీలకు గజ్జరం విద్యార్థులు

ప్రజాశక్తి - తాళ్లపూడి

మండలంలోని గజ్జరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు ఎంపికయ్యారని హెచ్ఎం మోహన్ తెలిపారు. మంగళవారం ఏలూరులో నిర్వహించిన జిల్లాస్థాయి యోగా పోటీల్లో తమ పాఠశాలకు చెందిన ఎం.మిల్కీ, జి.చరణ్‌తేజ రాణించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపియ్యారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు, తర్ఫీదు ఇచ్చిన పీడీ విద్యాసాగర్‌ను అభినందించారు.

నేరాలు ఘోరాలు

కోనపాపపేటలో చోరీ

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

మండలంలోని కోనపాపపేట గ్రామంలో సోమవారం రాత్రి చోరీ జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. చింతకాయ జగన్నాథం భవాని మాల వేసి కుటుంబ భ్యులతో కలిసి విజయవాడ వెళ్లారు. మంగళవారం ఉదయం జగన్నాథం ఇంటి తలుపులు తెరిచి ఉన్నాయని ఇంటి ఎదురుగా ఉన్న వారు గమనించి జగన్నాథం కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. దీంతో ఆయన ఇంటికి చేరుకుని బీరువాలను పరీక్షించగా లక్ష రూపాయలు నగదు, 15 కాసులు బంగారం దొంగలించినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బైక్ చోరీ నిందితుడు అరెస్టు

ప్రజాశక్తి - జగ్గంపేట

స్థానిక ఆర్‌టిసి కాంప్లెక్స్ వద్ద బైక్‌ను దొంగిలించిన నిందుతుడిని పోలీసులు అరెస్టు చేసినట్లు ఎస్ఐ టి.రఘునాథరావు తెలిపారు. సిసి పుటేజీని ఆధారంగా చేసుకుని నిందుతుడి కోసం గాలించగా ఆత్రేయపురం మండలం వెలిచేరుకు చెందిన తుపాకుల రామదాసు బైక్ చోరీకి పాల్పడినట్లు గుర్తించామన్నారు. నిందుతుడి కోసం గాలిస్తుండగా జగ్గంపేట నుంచి గోకవరం రోడ్డు వైపు వెళ్తున్నట్లు వచ్చిన సమాచారంతో మంగళవారం అతనిన అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. ముద్దాయి నుంచి బైకును స్వాధీనం చేసుకుని కోర్టులో హాజరుపర్చినట్లు తెలిపారు.

ఏలేరు కాలువలో మత్స్యకారుడు మృతి

ప్రజాశక్తి - ఏలేశ్వరం

ఏలేరు ప్రధాన కాలువలో చేపలు వేటకు వెళ్లి మత్స్యకారుడు మృతి చెందిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. ఈ మేరకు ఎస్ఐ ఎన్.రామలింగేశ్వరరావు తెలిపిన వివరాలు ప్రకారం.. స్థానిక నెయిలి పేటకు చెందిన గుదే శ్రీను(52) యథావిధిగా సోమవారం ఉదయం ట్యూబుపై ఏలేరు ప్రధాన కాలవలో వేటకు వెళ్లాడు. చేపల వేటాడే క్రమంలో నీటి ప్రవాహానికి ట్యూబ్ పైనుంచి అదుపుతప్పి నీటిలో పడిపోయాడు. గజ ఈతగాళ్ల సహకారంతో కుటుంబ సభ్యులు గాలింపు చేపట్టగా శ్రీను మృతదేహం లభ్యమయింది. మృతుని భార్య గుదే కృష్ణవేణి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పేకాట శిబిరంపై పోలీసుల దాడి

ప్రజాశక్తి - గండేపల్లి

మండలంలోని ఎల్లమిల్లి గ్రామ శివారున నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో నలుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఎస్ఐ శివనాగు తెలిపారు. వారి నుంచి రూ.32,300 నగదును స్వాధీనం చేసుకుని, వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

చోరీకి పాల్పడిన వ్యక్తి అరెస్ట్

ప్రజాశక్తి - రాజానగరం

చోరీకి పాల్పడిన వ్యక్తిని అరెస్టు చేశామని రాజానగరం సిఐ ఎస్.ప్రసన్నవీరయ్యగౌడ్ తెలిపారు. ఈ వివరాలను మంగళవారం ఆయన మీడియాకు వెల్లడించారు.కానవరంలో సంగిశెట్టి సీతారామాంజనేయులు ఈ నెల 3వ తేదీ రాత్రి 8.30 గంటల సమయంలో ఇంటికి తాళం వేసి బయటకు వెళ్లాడు. తిరిగి రాత్రి 12.30 వచ్చాడు. ఆ సయమంలో ఇంట్లో ఉన్న 14 కాసుల బంగారం వస్తువులు, రూ.20 వేల నగదు చోరీకి గురైనట్టు గుర్తించాడు. దీంతో పోలీసులు ఫిర్యాదు చేశాడు. ఎస్ఐ మనోహర్ కేసు దర్యాప్తు చేపట్టారు. గ్రామానికి చెందిన సంగిశెట్టి శివన్నారాయ ఇను నిందితునిగా గుర్తించారు. విచారణలో నేరం అంగీకరించాడు. నిందితుడు 5 కాసుల బంగారాన్ని రాజమండ్రిలో అమ్మేగా మిగిలిన 9 కాసులు, రూ.10 వేలు నగదు స్వాధీనం చేసుకున్నారు. బంగారం విలువ రూ.1.50 లక్షలు ఉంటుందని తెలిపారు. ఈ మేరకు ఎస్ఐ, సిబ్బందిని సిఐ అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయుడు మృతి

ప్రజాశక్తి - గోపాలపురం

పశ్చిమగోదావరి జిల్లా టి.నర్సాపురం మండలం బొర్రంపాలెం గ్రామానికి చెందిన తెలుగు ఉపాధ్యాయుడు కొనకళ్ల గణేష్‌కుమార్(41) గోపాలపురం శివారు మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. గణేష్‌కుమార్ చాగల్లు మండలం బ్రాహ్మణగూడెం హైస్కూల్లో తెలుగు ఉపాధ్యాయులుగా పని చేస్తున్నాడు. భార్య, కుమార్తెతో కలిసి సమిశ్రగూడెంలో నివాసం ఉంటున్నాడు. మంగళ వారం ఉదయం సెలవు పెట్టి బొర్రంపాలెం గ్రామానికి బైకుపై బయలుదేరాడు. గోపాలపురం శివారు అమరావతి కాటా వద్దకు వచ్చేసరికి కొయ్యల గూడెం వైపు నుంచి గోపాలపురం వస్తున్న లారీ ఎదురుగా వచ్చి ఢీకొంది. ఈ ప్రమాదంలో గణేష్ కుమార్ తీవ్రంగా గాయపడ్డాడు. అతన్ని స్థానికులు వెంటనే గోపాలపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలిం చారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం రాజమండ్రిలోని ప్రయివేటు ఆసుత్రికి తీసు ళ్లారు. పరిస్థితి విషమించడంతో మృతి చెందాడు. ఆయన భార్య కొనకళ్ల బేబీఆదిలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ కె.సతీష్ కుమార్ తెలిపారు.

పల్లంలో జోరుగా యానాం మద్యం

ప్రజాశక్తి - కాట్రేనికోన

మండల పరిధిలోని తీర ప్రాంత మత్స్యకార గ్రామమైన పల్లం తీర గ్రామంలో జాతర సందర్భంగా మంగళవారం బహిరంగంగా, జోరుగా యానాం మద్యాన్ని విక్రయించారు. ఓ పక్కన పోలీసులు కాపలా ఉన్నా యానాం చీప్ లిక్కర్ అమ్మకాలు జరిగాయి. యానాంలో రూ.50కి కొనుగోలు చేసి రూ.150 నుంచి రూ.250కు అమ్ముతూ సొమ్ము చేసుకుంటూ అమాయక మత్స్యకారుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు మద్యం విక్రేతలు. ఇంత జరుగుతున్నా కాట్రేనికోన మండలంలో యానాం మద్యం అమ్మకాలు లేవంటూ స్వయంగా మమ్మిడివరం ఎక్సైజ్ ఎస్ఐ తప్పుడు నివేదికను కలెక్టర్‌కు సమర్పించడం పట్ల పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

ఉద్యోగ భద్రత ఏదీ..?

- వినతులను పట్టించుకోని పాలకులు
- గాల్లోనే ప్రభుత్వ మద్యం షాపుల సిబ్బంది జీవితాలు

ఆందోళన చేస్తున్న ప్రభుత్వ మద్యం సిబ్బంది (ఫైల్ ఫొటో)

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

బాబు వస్తే జాబ్ వస్తుందంటూ గడిచిన సార్వత్రిక ఎన్నికల్లో కూటమి నేతలు ఊదర గొట్టారు. అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ మద్యం షాపుల్లో ఐదేళ్లుగా సేవలందించిన సిబ్బంది జీవితాలను గాల్లో కలిపేశారు. కూటమి ప్రభుత్వం నూతనంగా తీసుకొచ్చిన మద్యం పాలసీతో వందలాది సిబ్బంది జీవితాలు నేడు రోడ్డున పడ్డాయి.

గత వైసిపి ప్రభుత్వ పాలనలో మద్యం అమ్మకాలను ప్రభుత్వమే నిర్వహించేలా నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వ మద్యం దుకాణాల నిర్వాహణ కోసం ఒక్కో షాపునకు ఒక సూపర్‌వైజర్, ముగ్గురు సేల్స్‌మెన్స్, రాత్రి సమయాల్లో షాపు భద్రత కోసం వాచ్‌మెన్‌ను నియమిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. అందుకు అనుగుణంగానే అప్పటి వరకూ ఉన్న ఎక్సైజ్ శాఖ స్థానంలో సెబ్‌ను తీసుకొచ్చింది. సెబ్ ఆధ్వర్యంలో ఆయా ప్రభుత్వ మద్యం దుకాణాల నిర్వాహణకు అవసరమైన సిబ్బందిని నియమించింది. ఆవిధంగా జిల్లాలోని 157 మద్యం దుకాణాల నిర్వాహణకు సిబ్బందిని అధికారులు నియమించారు. జిల్లావ్యాప్తంగా 157 మంది సూపర్‌వైజర్లు, ఆయా దుకాణాల్లో సేల్స్‌ను బట్టి 400 మంది సేల్స్‌మెన్స్, 220 మంది వాచ్‌మెన్స్ నియమితులయ్యారు. గత ఐదేళ్లుగా ఆయా ప్రభుత్వ మద్యం దుకాణాల్లో చాలీ చాలని వేతనాలతో వీరింతా విధి నిర్వాహణలో ఉన్నారు. మొదటి మూడు నెలలు ఎపిఎస్‌డిసిఎల్ ద్వారా అవుట్ సోర్సింగ్ విధానంలో సిబ్బందిని తీసుకున్నారు. అనంతరం రాష్ట్రవ్యాప్తంగా రెడ్డి ఎంటర్‌ప్రైజెస్‌కి నిర్వాహణ బాధ్యతను అప్పగించడంతో సిబ్బందిని ఆ కంపెనీ ద్వారా కాంట్రాక్టు విధానంలో సిబ్బంది పని చేశారు. అయితే రెండు, మూడేళ్ల తరువాత సంబంధిత కంపెనీ సిబ్బందికి వేతనాలు చెల్లించే క్రమంలో చేసిన తప్పిదాలతో ప్రభుత్వం జోక్యం చేసుకుని థర్డ్ పార్టీకి నిర్వాహణ బాధ్యతను అప్పగించింది. వేతనాల చెల్లింపులో జరుగుతున్న జాప్యంతో సిబ్బంది తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని, జీతాలను పెంపుదల చేయాలనే డిమాండ్‌ను తెరపైకి తెచ్చారు. అధికారులు, ప్రజాప్రతినిధులను కలిసి వినతులు అందచేశారు. అయితే వీరి డిమాండ్లను పట్టించుకోకపోగా ఉద్యమాలు అంటే తొలగిస్తామని అధికారులు బెదిరింపులకు గురిచేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన అనంతరం కొద్ది నెలలపాటు థర్డ్ పార్టీ ద్వారానే వేతనాల చెల్లింపులు జరిగాయి. అయితే ఆగష్టు, సెప్టెంబర్ నెలలకు సంబంధించి నిర్వాహణ బాధ్యతను ఎస్‌ఆర్‌ఆర్ ప్రాజెక్టు అనే సంస్థకు ప్రభుత్వం అప్పగించింది. అక్టోబర్ 16వ తేదీ నుంచి ప్రయివేటు మద్యం అమ్మకాలకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది.

ప్రభుత్వాలు మారితే ఉద్యోగాలు తొలగిస్తారా..?

గత 5 ఏళ్ల నుంచి ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పనిచేస్తున్న ఉద్యోగులందరినీ బేషరతుగా కొనసాగించి ఉద్యోగ భద్రత కల్పించాలి. ప్రభుత్వాలు మారినప్పుడల్లా మద్యం పాలసీలు మారడంతో అప్పటివరకు పనిచేస్తున్న ఉద్యోగులే బలిపశువులుగా మారుతున్నారని, తక్షణం వివిధ ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టుల్లో వీరిని భర్తీ చేయాలని సిఐటియు డిమాండ్ చేస్తుంది.

చెక్కల రాజకుమార్, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి.

తమ బతుకులకు భరోసా ఏదీ?

ఐదేళ్ల చాలీచాలనీ వేతనాలతో ప్రభుత్వానికి సేవలందించిన తమ బతుకులకు భరోసా ఏదీ అని సిబ్బంది ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు. వైసిపి ప్రభుత్వంలో తమకు ఉద్యోగాలు కల్పించినప్పటికీ తగిన భరోసా ఇవ్వకుండా మా జీవితాలను గాలిలోకి వదిలేశారని వారు వాపోతున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని సంబంధిత శాఖ అధికారులకు, ప్రజాప్రతినిధులను కలిసి విజ్ఞప్తులు చేసినా పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ మద్యం పాలసీకి తాము వ్యతిరేకం కాదని, ఎటువంటి ప్రత్యామ్నాయ ఉపాధి మార్గాలు చూపకుండా తొలగించడం అన్యాయమని, మా కుటుంబాల పరిస్థితిని పరిగణలోకి తీసుకుని న్యాయం చేయాలని ఆంధ్రప్రదేశ్ స్టేట్ బేవరేజెస్ సూపర్‌వైజర్ అండ్ సేల్స్‌మెన్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు సబ్బతి చిట్టిబాబు కోరారు. లేదంటే జిల్లా వ్యాప్తంగా ఉద్యమం చేయడానికి కార్యచరణ చేపడతామని ఆయన హెచ్చరించారు.

సమావేశంలో పాల్గొన్న మంత్రులు, ఎంఎల్‌ఎలు, కూటమి నాయకులు

పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల్లో

కూటమి అభ్యర్థులను గెలిపించుకుంటాం

మంత్రి నిమ్మల రామానాయుడు

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

త్వరలో జరగబోయే పట్టభద్రుడు ఎంఎల్‌సి ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు గెలిపించుకుంటామని మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. ఉమ్మడి తూర్పు-పశ్చిమ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల ఓటరు నమోదు ప్రక్రియపై రాజమహేంద్రవరంలోని హోటల్ మంజీరా కన్వెన్షన్ హాల్‌లో మంగళవారం సమావేశం జరిగింది. తొలుత మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంఎల్‌సి ఎన్నికలకు సంబంధించి ఓట్ల నమోదు ప్రక్రియ నవంబరు నాటికి పూర్తి చేయాలని కోరారు. అభ్యర్థి ఎంపిక ప్రక్రియ అధిష్టానం పరిధిలో ఉందని త్వరలోనే వెల్లడిస్తారని ఈ సందర్భంగా తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా ఇంచార్జ్ మంత్రిగా తనను నియమించడం చాలా సంతోషంగా ఉందన్నారు. మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పుడు రాష్ట్రం వెంటిలేటర్‌పై ఉందన్నారు. ప్రధాని మోడీ సాయంతో వెంటిలేటర్ నుంచి ఆక్సిజన్ తీసుకునే స్థాయికి రాష్ట్రం వచ్చిందన్నారు. పోలవరం ప్రాజెక్టును కేంద్రం సహాయంతో పూర్తిచేస్తామన్నారు. ఇందులో భాగంగానే కేంద్రం రూ.12,500 కోట్లను కేటాయించిందన్నారు. లిక్కర్ పాలసీపై వైసిపి నాయకులు ఇష్టం వచ్చినట్టు మాట్లాడుతున్నారన్నారు. లిక్కర్ టెండర్లలో 90 వేల దరఖాస్తుల ద్వారా రూ.1,800 కోట్లు ఆదాయం వచ్చిందన్నారు. వారం పది రోజుల్లో ఇసుక సమస్యనూ తీరుస్తామన్నారు. మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ త్వరలో జరగబోయే పట్టభద్రులు ఎంఎల్‌సి ఎన్నికలకు కూటమినేతలంతా కలిసి వ్యవహారచన చేశామన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత రాష్ట్రం అభివృద్ధి, సంక్షేమం వైపు పయనిస్తుందన్నారు. ఈ సమావేశంలో టిడిపి అధ్యక్షులు పల్లా శ్రీనివాస్, ఎంఎల్‌ఎలు ఆదిరెడ్డి శ్రీనివాస్, బత్తుల బలరామకృష్ణ, పంతం నానాజీ, వేగుళ్ల జోగేశ్వరరావు, నిమ్మకాయల చినరాజప్ప తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీల్లో శారదా విద్యార్థిని ప్రతిభ

ప్రజాశక్తి - యానాం రూరల్

పుదుచ్చేరిలో జరిగిన జాతీయ స్థాయి అత్యా, పత్యా పోటీల్లో యానాం శారదా విద్యా నికేతన్ విద్యార్థిని చింతా శ్రీదుర్గాలక్ష్మీ షణ్ముఖప్రియ ఉత్తమ ప్రతిభను చాటుకుంది. పుదుచ్చేరి రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహించి ఇండియా లెవెల్లో బంగారు పతకం దక్కించుకుందని హెచ్ఎం చిక్కాల వెంకటేశ్వరరావు తెలిపారు. ఉత్తమ ప్రతిభను చాటుకున్న విద్యార్థినిని పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు, శారదా విద్యానికేతన్ ప్రతినిధులు కంచర్ల చిన్నాబ్బాయి, కాపగంటి ఉమా శంకర్, కంచర్ల శ్రీనివాస్, వ్యాయామ ఉపాధ్యాయుడు చింతా వెంకన్న, ఉపాధ్యాయులు అబినందనలు తెలిపారు.

తప్పని ట్రాఫిక్ కష్టాలు

ప్రజాశక్తి - సామర్లకోట

మాధవపట్నం వద్ద ట్రాఫిక్ జామ్

కాకినాడకు వెళ్లాలంటే ట్రాఫిక్ కష్టాలు తప్పడం లేదు. మండలంలోని మాధవపట్నం వద్ద రోడ్డు పూర్తిగా శిథిలమైంది. దీంతో సామర్లకోట నుంచి కాకినాడకు 20 నిమిషాల్లో చేరుకోవాల్సిన ప్రయాణం 40 నిమిషాలైనా చేరుకోలేని పరిస్థితి ఏర్పడుతోంది. దారి పొడవునా రహదారికి గోతులు పడటం, మాధవపట్నం వద్ద వాహనాలన్నీ ఒకే వైపుగా వెళ్ళాల్సి రావడంతో ట్రాఫిక్ సమస్య అధికమవుతోంది. సరస్వతి విద్యాపీఠం వద్ద నుంచి మాధవపట్నం సెంటర్ దాటాలంటే ఏ వాహనానికైనా అయినా అరగంట సమయం పడుతుందని ప్రయాణికులు చెబుతున్నారు. అక్కడి ఆంజనేయస్వామి ఆలయం వైపు రోడ్డుమార్జిన్ కొంతదూరం కోతకు గురికావడంతో వాహనదారులు రోడ్డు దిగే పరిస్థితి ఉండటం లేదు. దీనికితోడు రోడ్డు మొత్తం గుంతలతో ప్రమాదకరంగా మారడంతో వాహనదారులు ఆచితూచి వెళ్ళాల్సి రావడంతో రాకపోకలకు తీవ్ర జాప్యం జరుగుతుంది. ప్రయాణికుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని సంబంధిత శాఖ అధికారులు రోడ్డుకు మరమ్మతులు చేపట్టడంతోపాటు, ట్రాఫిక్ రాకపోకలను క్రమబద్ధీకరించేందుకు ట్రాఫిక్ సిబ్బందిని ఏర్పాటు చేయాలని ప్రయాణీకులు కోరుతున్నారు.

దోమ పోటు నివారణపై అవగాహన

ప్రజాశక్తి - పెద్దాపురం

రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారి

వరి పంటకు వస్తున్న దోమ పోటును నివారిణపై రైతులకు అవగాహన కార్యక్రమం జరిగింది. మంగళవారం మండలంలోని వడ్లమూరు రైతు సేవా కేంద్రం వద్ద సర్పంచ్ దుర్గా వరలక్ష్మీదేవి అధ్యక్షతన పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. రైతులకు వరి పంటలో దోమపోటు నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి కె.సంజయ్‌కుమార్, పశువైద్యాధికారి డాక్టర్ కోటి, వ్యవసాయ విస్తరణాధికారి ఎన్‌వివి. ప్రసాద్, వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి - యానాం రూరల్

యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని పలువురు పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక ఎస్ఆర్‌కె ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో రెడ్ రిబ్బన్ క్లబ్, ఎన్ఎస్ఎస్ యూనిట్‌ల సంయుక్త ఆధ్వర్యంలో 'మాదకద్రవ్యాల వ్యసనం- శారీరక, మానసిక స్థితులపై ప్రభావం' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వరుగు భాస్కర్ రెడ్డి, బిపి.సైరాస్‌కుమార్ మాట్లాడుతూ యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. ఈ సందర్భంగా మాదకద్రవ్యాలను వినియోగించడం వల్ల జరిగే అనర్థాలను వివరించారు.ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ రీజనల్ కో- ఆర్డినేటర్ కృష్ణసుధాకర్, ఎన్ఎస్-ఎస్ పిఒలు డాక్టర్ చెల్లె నరేష్, ఎస్.శ్రీనివాసరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

శంఖవరంలో అవగాహనా ర్యాలీ

ప్రజాశక్తి - శంఖవరం

ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

శంఖవరంలో మానసిక వికలాంగులపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. మంగళవారం స్థానిక పర్వత సత్యనారాయణమూర్తి జడ్‌పి పాఠశాలలో ఎంఇఒ సూరిశెట్టి వెంకటరమణ అధ్యక్షతన అవగాహన కార్యక్రమం జరిగింది.కొందరు విద్యార్థులు చదవడం, రాయడంపై మతిమరుపు కలిగి ఉంటారని, వీరికి ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చినట్లయితే చదవడం రాయడం చేయగలుగుతారని తెలిపారు. అనంతరం గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం భాస్కర లక్ష్మీ, ఇతర అధికారులు కె.వెంకటేశ్వరరావు, జి.స్వప్న, డి.బ్రహ్మానందరావు, బి.నాగార్జున, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తాళ్లరేవులో అత్యధిక వర్షపాతం

ప్రజాశక్తి - తాళ్లరేవు రూరల్

ఎడతెరిపి లేకుండా సోమవారం రాత్రి నుంచి మంగళవారం తెల్లవారు జాము వరకు తాళ్లరేవు లో భారీ వర్షం కురిసింది. తాళ్లరేవు మండలంలో అత్యధికంగా 124 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. మండలంలోని రహదారులు నీట మునిగి ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు.

దరఖాస్తులకు 28 వరకూ గడువు

ప్రజాశక్తి - యానాం రూరల్

యానాంకు చెందిన ఎస్‌సి, ఎస్‌టి విద్యార్థులు ఆన్‌లైన్‌లో ఎన్ఎస్‌పి ద్వారా ఉపకారవేతనాలకు దరఖాస్తు చేసుకోవడానికి గడువును ఈ నెల 28 వరకూ పొడిగించినట్లు ఆదిద్రావిడ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ రేకాడి కృష్ణమూర్తి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రీమెట్రిక్, పోస్ట్ మెట్రిక్ తదితర ఉపకార వేతనాలకు ఆయా ఎస్‌సి విద్యార్థులు గడువు లోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

అక్షరాస్యతను పెంపొందించేందుకు 'ఉల్లాస్'

ప్రజాశక్తి - అమలాపురం సిటీ

నిరక్షరాస్యుల్లో ఆర్థిక, డిజిటల్, ఫంక్షనల్ అక్షరాస్యతను పెంపొందించే దిశగా ఉల్లాస్ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టామని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ తెలిపారు. మంగళవారం ఆర్థిక డిజిటల్, ఫంక్షనల్ అక్షరాస్యత పేరిట ఉల్లాస్ కార్యక్రమం నిర్వహణ విధివిధానా లపై జిల్లా కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి సంబంధిత అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 15 సంవత్సరాలు పైబడిన స్వయం సహాయక సంఘ నిరక్షరాస్య మహిళలు, పాఠశాలల్లో పనిచేసే ఆయాలు, వంటపనిచేసేవారు, హెల్పర్లు, నైట్ వాచ్మెన్లు అంగన్‌వాడీ ఆయాలు అందరికీ ఆర్థిక ఫంక్షనల్ డిజిటల్ అక్షరాస్యతను నేర్పించే దిశగా ఉల్లాస్ కార్యక్ర మాన్ని ప్రవేశపెట్టినట్లు ఆయన తెలిపారు. కోనసీమ జిల్లా వ్యాప్తంగా 7,128 మందిని లక్ష్యంగా నిర్దేశించినట్లు ఆయన పేర్కొన్నారు .జిల్లావ్యాప్తంగా తక్కువ అక్షరాస్యత కలిగిన 9 మండలాలైన ఆలమూరు, కపిలేశ్వరపురం, కాట్రేనికోన ఆత్రేయపురం, రావులపాలెం రాయవరం, ఐ.పోలవరం, కె.గంగవరం మండపేట మండలాలలో నిరక్షరాస్యులను ఎంపిక చేసి అక్షరాస్యులుగా తీర్చిదిద్దనున్నట్లు ఆయన తెలిపారు. ఈ మండలాలలో నిరక్షరాస్యులకు పాఠాలు బోధించే వాలంటరీ టీచర్లను కమ్యూనిటీ కోఆర్డినేటర్లు, విఎఒల ద్వారా ఎంపిక చేయాలని ఆయన స్పష్టం చేశారు. వాలంటరీ టీచర్లను, నిరక్షరాస్యులను 1: 10 నిష్పత్తిలో మ్యాపింగ్ చేసి వారి వివరాలను ఈ నెల 16 నుంచి 24వ తేదీ వరకు ఉల్లాస యాప్ లో అప్డేట్ చేయాలని ఆయన సూచించారు. అక్టోబర్ 25న రాష్ట్రస్థాయిలో జిల్లాస్థాయి రిసోర్స్ పర్సన్స్‌కు, అక్టోబర్ 29న జిల్లాస్థాయిలో మండల స్థాయి రిసోర్స్ పర్సన్స్‌కు , నవంబర్ 2న మండల స్థాయిలో వాలంటరీ టీచర్లు, విఒఎ, క్లస్టర్ కోఆర్డినేటర్లకు కార్యక్రమాన్ని ఎలా నిర్వహించాలనే అంశంపై శిక్షణిస్తారని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో సాయంత్రం నాలుగు గంటల నుండి 6 గంటల వరకు ఆరు నెలల కాల వ్యవధిలో 200 గంటలు శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తారని తెలిపారు. నవంబర్ 5 నుంచి 2025 మార్చి 15 వరకు తరగతులు నిర్వహిస్తారని ఆయన తెలిపారు. తదుపరి మార్చి నెలలో పరీక్షలు నిర్వహించి ధ్రువపత్రాలను పంపిణీ చేస్తారన్నారు. జిల్లా గ్రామీణాభివద్ధి, మహిళా శిశు సంక్షేమం, పాఠశాల విద్య అధికారులు సంబంధిత మండలాలలో వారి పరిధిలోని నిరక్షరాస్యులను గుర్తించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలను సాయంత్రం నాలుగు గంటల నుంచి 6 గంటల వరకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించడానికి అణువుగా ఉంచేలా చర్యలు తీసుకోవాలని మహిళ శిశు సంక్షేమ శాఖ అధికారులను ఆదేశించారు.కార్యక్రమంలో జిల్లా వయోజన విద్యా అధికారి పి.పోసయ్య, డిఆర్‌డిఎ పీడీ డాక్టర్ శివ శంకర్ ప్రసాద్, డిఇఒ ఎం.కమల కుమారి, డిఐ పిఆర్ఒ కె.లక్ష్మీనారాయణ, డిపిఒ శాంతి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వాడివేడిగా మండల పరిషత్ సమావేశం

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం

మండల పరిషత్ సమావేశంలో ఎంఎల్ఎ వేగుళ్లను ప్రశ్నిస్తున్న ఎంపిటిసి మధు

స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరం లో ఎంపిపి మేడిశెట్టి సత్యవేణి దుర్గారావు అధ్యక్షతన మండల పరిషత్ సమావేశం మంగళవారం వాడీవేడిగా జరిగింది. కపిలేశ్వరపురం మండలంలోని అచ్యుతాపురం గ్రామంలో 2014లో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన గోకులం రైతుకు బిల్లులు ఎలా మంజూరు చేశారంటూ వైసిపి గ్రామ ఎంపిటిసి మండల విప్ పలివెల మధు పశుసంవర్ధక శాఖ అధికారిలను ప్రశ్నించారు. దీనిపై ఎంఎల్ఎ వేగుళ్ళ కలగజేసుకొని అప్పుడు మా ప్రభుత్వం హయాంలోనే కదా జరిగింది. అప్పుడు ఏం చేశారంట ఎంఎల్ఎ వేగుళ్ళ ప్రశ్నించారు. దీనిపై ఎంపిటిసి మాట్లాడుతూ మీరు ఎన్ని సమావేశానికి హాజరయ్యారంటూ ఎంఎల్ఎ వేగుళ్లను నిలదీయడంతో నీకు చెప్పవలసిన పని లేదంటూ ఎంపిటిసిపై ఎంఎల్ఎ ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో సమావేశంలో ఇద్దరు మధ్య కొద్దిసేపు వాగ్వాదం చోటు చేసుకుంది. ఈ సమావేశానికి ఎంఎల్ఎ వేగుళ్ళ, ఎంఎల్‌సి తోట త్రిమూర్తులు, హాజరయ్యారు. ఈ సమావేశంలో ఎంపిడిఒ కె.రత్నకుమారి అభివృద్ధి కార్యక్రమాల గురించి మాట్లాడారు. అంగర ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి దాతలు సహకారంతో అదనపు భవనం నిర్మించారని, వైద్యులు కొరత భర్తీ చేయాలని అంగర ఎంపిటిసి సభ్యుడు అడ్డాల శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యుడు పుట్టపూడి వీర వెంకట సూర్యనారాయణ, ఎంపిడిఒ కె.రత్నకుమారి, తహశీల్దార్ చిన్నారావు, పిఆర్ జెఇ రాఘవులు, పలు గ్రామాల సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు పలు శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పాస్‌పోర్టు పోయినది

రాకుర్తిపాలెం గ్రామానికి చెందిన సింగంశెట్టి వీర వెంకట వరప్రసాద్ అను నేను రాకుర్తిపాలెం మా ఇంటి వద్ద నుండి కొత్తపేట జిరాక్స్ నిమిత్తం మోటార్ సైకిల్ మీద వెళుతుండగా దారి మార్గంలో నెంబర్ **F7412673** పాస్‌పోర్టు పడిపోయినది. దొరికినవారు ఈక్రింది అడ్రస్‌కు అందజేయగలరు.

సింగంశెట్టి వీర వెంకట వరప్రసాద్
తండ్రి: సత్యనారాయణమూర్తి
రాకుర్తిపాలెం, మోడేకుర్రు శివారు
కొత్తపేట మండలం
డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా
సెల్: 76759 90806

బాండ్ పడిపోయినది

కాకినాడ జిల్లా, సర్పవరం, వసంతనగర్, యర్రంశెట్టి పద్మావతి కు సంబంధించిన ది కాకినాడ కోఆపరేటివ్ బిల్డింగ్ సొసైటీ లిమిటెడ్‌కు చెందిన ఫిక్సడ్ డిపాజిట్ బాండ్ పడిపోయినది. బాండ్ నెంబర్: **AP-002-FD-I-426306.** ది. 05-10-2024వ తేదీన బాండ్‌ను జిరాక్స్ తీయించుకుని సర్పవరం నుండి ఇంటికి వెళుతుండగా మార్గం మధ్యలో పడిపోయినది. దొరికినవారు ఈక్రింది అడ్రస్‌కు అందజేయగలరు.

యర్రంశెట్టి పద్మావతి
డోర్ నెంబర్: 3-402/29
సర్పవరం, వసంత నగర్, కాకినాడ
సెల్: 7842323932

మహారాజశ్రీ అమలాపురం సివిలు జడ్జి (సీనియరు డివిజన్) వారి కోర్టులో
E.A. No. 13/2022 in E.P. 19/2020 in O.S. No. 152/2003

Between:
రెడ్డి అండ్ రెడ్డి ఇంపోర్ట్సు అండ్ ఎక్స్‌పోర్ట్సు, భీమవరం తరపున మే॥ పార్టనర్ జి.ఆర్.కె.రెడ్డి -పిటీషనరు/ DHr

ఎదిరి

2. కట్టా నానాజీ, S/o. లేటు శ్రీహరి, హిందువు, గోడిలంక, అల్లవరం మండలం, పూర్వపు తూర్పుగోదావరి జిల్లా.
3. కట్టా బ్రహ్మజీ, S/o. లేటు శ్రీహరి, హిందువు, గోడిలంక, అల్లవరం మండలం, పూర్వపు తూర్పుగోదావరి జిల్లా -రెస్పాండెంట్లు

పైన పేర్కొన్న డిక్రీ అమలు గ్రంధములో చనిపోయిన 1వ JDr అయిన లేటు కట్టా శ్రీహరి గార్కి వారసులు అయిన మిమ్ములను వారి స్థానే పార్టీలుగా చేర్పించమని దాఖలు చేసిన పిటిషనులో కోర్టు నుండి ఎన్నిమార్లు నోటీసులు పంపించినప్పటికి డిక్రీ అమలు విషయము తెలిసి యుండి డిక్రీ బాకీ ఎగవేయు దురుద్దేశ్యముతో బుద్ధిపూర్వకముగా నోటీసులు తీసుకొనకుండా కాలయాపన చేయుచున్నందున మీపై అమలు జరగవలసిన నోటీసులు ఈ ప్రకటన ద్వారా మీకు తెలియజేయమని శ్రీ కోర్టు వారు మీ యొక్క హాజరు నిమిత్తం **ది. 01-11-2024 సం॥ తేదీకి వాయిదా వేసియున్నారు. కావున వాయిదా తేదీన పైన పేర్కొన్న కోర్టులో ఉదయం గం॥ 10.30 ని॥లకు** మీరు స్వయముగా గాని, వకీలు ద్వారా గాని హాజరైయుందులకు ఆక్షేపణలు ఉన్న ఎడల తెలుపుకొనవలయును. లేనియెడల మీ పరోక్షమందు పై పిటీషను గ్రంధము తీర్మానించబడునని గ్రహించలయును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ననుసరించి)

వీరా నాగేశ్వరరావు
పిటీషనరు తరపు న్యాయవాది
అమలాపురం పళ్ళ వెంకట్రావు వీధి, అమలాపురం
ది.12-10-2024 సెల్: 9948882983

మహారాజశ్రీ 1వ అదనపు సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు, రాజమహేంద్రవరం
O.S. No. 64/2022

Between:
Karra Surya Prakasa Rao ...Plaintiff
AND
Tummal Tata Naidu and Others ...Defendants

D-2: Dontamsetti Ekambaram, S/o. late Mallikarjuna Lingam, age 51 years, Business, D.No. 3-2, Society Street, Veeravaram Village, Kadiyam Mandal. ...2nd Defendant

పై నెంబరు దావాలో 2వ ప్రతివాది అయిన మీకు కోర్టు ద్వారా ఎన్నిసార్లు సమన్సు/ నోటీసులు పంపినా మీరు వాటిని తీసుకోకుండా ఉద్దేశ్యపూర్వకంగా త్రిప్పి వేయుచున్నారు. కావున **ది. 05-11-2024 సం॥రం తేదీ ఉదయం 10.30 ని॥లకు** మీరు స్వయంగా గాని, లేదా ప్లీడరు ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరు అయ్యి సదరు పై దావాలో మీ ఆక్షేపణలను తెలుపుకొనవలెను. లేనియెడల సదరు దావాను మీకు పరోక్షముగా శ్రీ కోర్టు వారు తీర్మానించెదరు.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

వి.విజయ భాస్కరరావు
రాజమండ్రి **ఐ.రాంబాబు**
15-10-2024 అడ్వకేట్స్, రాజమండ్రి

వేలం ప్రకటన
మహారాజశ్రీ కొవ్వూరు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో
E.P. 11/2014 in O.S. No. 322/2011

Between:
1. దావాల రాజు -డిక్రీ హోల్డర్

AND

1. పూసపూడి పేరయ్యశాస్త్రి, తండ్రి: గోపాలకృష్ణ, చిక్కాల, చాగల్లు మండలం.
2. పూసపూడి రాజేశ్వరి, భర్త: వెంకటేశ్వరరావు, చిక్కాల, చాగల్లు మండలం. ...JDrs

పై నెంబరు E.P. గ్రంధములో డిక్రీ హోల్డరు తన బాకీ రాబట్టుకొను నిమిత్తం JDrs తాలూకు EP Schedule దాఖలా ఆస్తిని **ది. 05-11-2024వ తేదీన ఉదయం గం॥ 10.30 నిమిషములకు** పై కోర్టులో వేలం వేయుదురు. ఆసక్తి వున్నవారు వేలములో పాల్గొనవచ్చును. పూర్తి వివరములకు డిక్రీ హోల్డర్ ప్లీడరు గారిని గాని, కోర్టు అమీనా గారిని గానీ సంప్రదించవచ్చును.

షెడ్యూలు

పశ్చిమగోదావరి జిల్లా, ప్రస్తుతం తూర్పుగోదావరి జిల్లా, నిడదవోలు SRO లిమిట్స్, చాగల్లు మండలం, చిక్కాల గ్రామపంచాయతి లిమిట్స్, చిక్కాల గ్రామం, ఆర్.ఎస్. నెం. 798/2, య. 0-14 సెంట్లు స్థలము, అందలి ఆర్‌సిసి బిల్డింగ్ డోర్ నెం. 3-25 కి హద్దులు.

తూర్పు: రాజ వీధి. **దక్షిణం:** పూసపూడి సుబ్బారావు, **పడమర:** పట్టపగలు ప్రసాదరావు, వగైరా. **ఉత్తరం:** పట్టపగలు చంద్రరావు, కాలనీకి దారి.

పై హద్దుల మధ్య య. 0-14 సెంట్లు స్థలము అందలి ఆర్‌సిసి బిల్డింగ్ మరియు తలుపులు, కిటికీలు, అన్ని యాజిమెంటు హక్కులతో సహా వేలం కావలసి ఉన్నది.

డిక్రీ హోల్డరు విలువ: రూ. 1,00,000/-
అమీనా విలువ: రూ. 20,00,000/-
సబ్ రిజిష్ట్రార్ విలువ: రూ. 24,14,000/-
వేలం తేదీ: 05-11-2024

ఆత్మూరి సత్యనారాయణ
డిక్రీ హోల్డరు తరపు అడ్వకేట్
కొవ్వూరు కొవ్వూరు
ది.11-10-24 సెల్: 9849847197